ఘనంగా హనుమాన్ జయంతి

- హనుమాన్ ఆలయాల్లో భక్తుల సందడి
- స్వామివారి ప్రత్యేక అభిషేకాలు, పూజలు
- పలుచోట్ల భక్తులకు అన్నదానాలు



మేడ్చల్ : హనుమాన్ జయంతి సందర్భంగా డల్లాస్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

చిలుకానగర్ గుట్టలో అభయయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కీసరగుట్టలో స్వామివారికి పూజలు చేస్తున్న చైర్మన్ నాగలింగంశర్మ, ఈఓ నరేందర్

ఉప్పల్, జూన్ 1: హనుమాన్ జయంతిని నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ గణేష్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ హన్మంతు, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిలుకానగర్‌లోని చిలుకేశ్వరగుట్టలో హనుమాన్ జయంతిసందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పూజలు చేశారు. ఉప్పల్ ప్రధాన రహదారిలోని ఆభయాంజనేయస్వామి ఆలయంలో చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ గీతాప్రవీణ్ ముదిరాజ్ శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు.

- **నేరేడ్‌మెట్:** శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలోని శ్రీ సంకట విమోచన ఆంజనేయ స్వామికి శనివారం ఉదయం ప్రభాత ఆరాధన, వివిధ ఫల రసాలతో పంచామృతాభిషేకం నిర్వహించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎబి.రవీంద్ర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకట రమణాచార్యులు , అర్చకులు తులసి వెంకట రమణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా ఆంజనేయస్వామికి అభిషేకం,విశేష అలంకరణ, తమలపాకులతో అర్చన కార్యక్రమం నిర్వహించారు.
- **కీసర:** కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి, చీర్యాల్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో ఘనంగా హనుమాను జయంతిని నిర్వహించారు. ఆలయ చైర్మన్‌లు నాగలింగంశర్మ,లక్ష్మీనారాయణ, ఈఓ నరేందర్‌లు, వేదపండితులు పాల్గొన్నారు. అలాగే కీసరలోని శ్రీ ప్రసన్నంజనేయస్వామి ఆలయం లో శ్రీ లక్ష్మీగణపతి హోమం, స్వామివారికి పంచామృతాభిషేకాలను బ్రహ్మణులు ఘనంగా నిర్వహించారు.
- **మల్లాపూర్:** హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని మల్లాపూర్ డివిజన్ నెహ్రూనగర్‌లోని హన్‌మాన్ ఆలయంలో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

ఘట్‌కేసర్:పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలు, మండల గ్రామాల్లో హన్‌మాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- **కాప్రా:** కాప్రాలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో జయమంగళ పంచముఖ ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు కిరణ్‌ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో రామాంజనేయులు, ఈఓ కృష్ణమాచార్యులు,మాజీ చైర్మన్‌మహేష్‌గౌడ్,భక్తులు పాల్గొన్నారు.
- **మల్లాపూర్:** హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ ఇందిరనగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో కార్పొరేటర్ జె. ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,పాల్గొన్నారు.అలాగే మల్లా పూర్ డివిజన్ నెహ్రూనగర్‌లోని హన్‌మాన్ ఆల యంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లైళ్ల ప్రవీన్, శ్రీనివాస్, గణేశ్, రాంచందర్, సబిత, రఘు, తది తరులు పాల్గొన్నారు.
- **మేడ్చల్ కలెక్టరేట్:**నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ, నాగారం, రాంపల్లి, దమ్మాయిగూడ, బండ్లగూడ, కుందన్‌పల్లి, రాజీవ్‌గృహకల్ప కాలనీలో హనుమాన్ ఆలయాల్లో స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్లు చంద్రారెడ్డి, వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్, వైస్ చైర్మన్లు మల్లేష్ యాదవ్, నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు,వివిధ పార్టీల నా యకులు,భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

మెడిసిన్ విద్యార్థినికి ఆర్థిక సాయం

గీతాంజలికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మల్లాపూర్, జూన్ 1: చదువులో ఉత్తమ ర్యాంక్ సాధించి ఆర్థిక స్థోమత లేని పేద మధ్య తరగతి విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అభినందించారు. మల్లాపూర్ డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ చుంచు నర్సింగ్‌రావు కూతురు గీతాంజలి ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ 3వ సంవత్సరం చదువుతుంది. రెండు సంవత్సరాలతో పాటు 3వ సంవత్సం ఫీజు బండారి లక్ష్మారెడ్డి శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా గీతాంజలికి అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై లారీ బోల్తా..తప్పిన ప్రమాదం

కీసర, జూన్ 1: కీసర ఔటర్‌రింగ్ రోడ్డుపై నుంచి లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌తో సహా ఎవరికి ప్రాణనష్టం జరుగలేదు. కందిపప్పు లోడ్‌తో బెంగుళూరుకు వెళ్తున్న లారీ కీసర ఔటర్‌రింగ్ రోడ్డు రాంపల్లిదాయర శివార్లలో ప్రమాదవశత్తు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ సచిన్ సురక్షితంగా బయటపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొన్నారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాకాలంలో ఎమర్జెన్సీ టీంల సేవలు: డీసీ

మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీంలను ప్రారంభిస్తున్న డీసీ శ్రీనివాస్ రెడ్డి

మల్కాజిగిరి, జూన్ 1: వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులో సేవలందించాడానికి మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీంలను ఏర్పాటు చేశామని అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం సర్కిల్ కార్యాలయం వద్ద ఎమర్జెన్సీ టీంలను డీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో వరదముంపునకు గురవుతున్న కాలనీలను ఇప్పటికే గుర్తించామన్నారు. అత్యవసర పరిస్థితులో మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీంలు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు రంజిత్ రెడ్డి, కార్తీక్, ఏఈలు లక్ష్మి, రవళి, అరుణ్, సిబ్బంది లాలిష్, విజయరామరావు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

మేడిపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

పీర్జాదిగూడ, జూన్ 1: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు శనివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్‌లో మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు రవీందర్ సూచనలతో పార్టీ శ్రేణులు రాష్ట్ర ఆవిర్భావ దినోత్స దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిపల్లిలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అనంతరం అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

మేడ్చల్, జూన్ 1: శామీర్‌పేట మండలంలోని పలు ఫీడర్ల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, పోతారం గ్రామానికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆలియాబాద్ ఏఈ తెలిపారు.

శిల్పారామంలో నృత్యప్రదర్శనలు

ఉప్పల్ , జూన్ 1: వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉప్పల్ శిల్పారామంలో కూచిపూడి నృత్యప్రదర్శనలు శనివారం నిర్వహించారు. వినాయక కౌతం, తక్కువేమి మనకు, రామకోదండ రామ, శ్రీమన్నారాయణ, పలుకే బంగారమయ్యేనా, వినరో భాగ్యము, వింతలు వింటివా యశోద, నాటిక రంజిని పదవర్ణం, త్యాగరాజ కీర్తనలు ఎంతో అలరించాయి. ఈ కార్యక్రమంలో లక్ష్మిప్రియా, సహస్ర, వైష్ణవి, రిధి, నిహారిక, హిరణ్య, ఈషా, సాన్విక, అధిత్రి, వైద్య, సంకీర్త్, ఐశ్వర్యలక్ష్మి, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే నిరు పేదలకు న్యాయం

మల్లాపూర్, జూన్ 1:మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని చైతన్యనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం నివాసాల్లో రేణుక ఉపేందర్‌కు మంజూరైన ఇంటి గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి. శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరు పేద కుటుంబాల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పనికి వెళ్లిన మహిళ శవమై..

జవహర్‌నగర్, జూన్ 1: పనికోసమని వెళ్లిన మహిళ దమ్మాయిగూడ మినీ డంపింగ్‌యార్డ్ సమీపంలో చెట్ల మధ్య శవమై కనిపించిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో నాగరాజు కథనం ప్రకారం... జవహర్‌నగర్‌లోని కార్మికనగర్‌లో గూడెలుగు చెన్నమ్మకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. ఆమె చిన్న కుమార్తె జ్యోతి(20) కూలీ పనులు చేస్తున్నది. జ్యోతి కల్లుకు బానిస కావడంతో మొదటి భర్త శివ ఆమెను వదిలేశాడు. అనంతరం మహేశ్‌ను పెళ్లి చేసుకుంది. కల్లు విపరీతంగా సేవిస్తుండటంతో జ్యోతి కుటుంబ పెద్దలతో మాట్లాడి జ్యోతిని కార్మికనగర్‌లో ఉంటున్న తల్లి వద్దకు పంపించాడు. మే 31న రోజు మాదిరిగానే పనికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. శనివారం మినీ డంపింగ్ యార్డ్ సమీపంలోని చెట్లపొదల మధ్య జ్యోతి మృతదేహం కనిపించిందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కల్లు అతిగా సేవించినప్పుడు మూర్ఛ వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నవజాత శిశువు మృతి

ఉప్పల్, జూన్ 1 : ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది నిర్లక్ష్యం, అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో శనివారం నవజాత శిశువు మృతిచెందింది. సిబ్బంది నిర్లక్ష్యంతోనే శిశువు మృతిచెందిందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. చిలుకానగర్ ప్రాంతానికి చెందిన మమతకు పురిటినొప్పులు రావడంతో డెలివరీ కోసం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. ఉదయం నాలుగు గంటల సమయంలో స్టాఫ్ నర్స్ డెలివరీ చేశారు. అరగంట సమయం తర్వాత శిశువులో కదలికలు లేకపోవడంతో వేరే ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. ఉప్పల్ పీహెచ్‌సీలో అంబులెన్స్ లేకపోవడం, 108కి సమాచారం అందించకపోవడంతో ఆటోలో నిలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. నిలోఫర్‌కు తీసుకెళ్లిన శిశువును పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. అంబులెన్స్‌లో ఆక్సిజన్‌తో తీసుకురాకపోవడంతోనే మృతిచెందినట్లు తెలియడంతో శిశువు బంధువులు ఉప్పల్ పీహెచ్‌సీ వద్ద నిరసన తెలియజేసి, సిబ్బందితో వాగ్వాదం చేశారు.

దేశ భద్రతలో...రక్షణ కవచంలా నిలవాలి

జవహర్‌నగర్, జూన్ 1: సమాజాభివృద్ధిలో సముజ్జిత సేవలందించాలని, దేశ భద్రతకు రక్షణ కవచంలా నిలవాలని సెంట్రల్ సెక్యూరిటీ ఫోర్స్, ఎయిర్ పోర్ట్‌సెక్టార్ డైరెక్టర్ ప్రవీర్ రంజన్ పిలుపునిచ్చారు. శనివారం శామీర్‌పేట మండలం హకీంపేట నేషనల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ అకాడమీ నీసా దీక్షిత్ పరేడ్ గ్రౌండ్‌లో 36వ బ్యాచ్‌కు చెందిన 50 అసిస్టెంట్ కమాండెంట్స్ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ సెక్యూరిటీ ఫోర్స్ ఎయిర్ ఫోర్ట్ సెక్టార్ డైరెక్టర్ ప్రవీర్ రంజన్ హాజరయ్యారు.

భర్త వేధింపులు తాళ లేక..ముగ్గురు పిల్లలతో కలిసి భార్య అదృశ్యం

జవహర్‌నగర్, జూన్ 1: భర్త వేధింపులు తాళ లేక ముగ్గురు పిల్లలతో కలిసి భార్య అదృశ్యమైంది. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో నాగరాజు కథనం ప్రకారం... బాలాజీనగర్‌లో నివసముండే రాజుకు,భార్య దివ్య అలియాస్ తులసితో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో కలిసి నివసిస్తున్నాడు. రాజు భార్యను నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడు. దివ్య అలియాస్ తులసి(30), కుమార్తెలు లహరిక(11), జున్ను(8), అనిష్(7) ఈనెల 1న పిల్లలను తీసుకుని ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్ళి ఇంత వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన తులసి,పిల్లలు(ఫైల్)

యువకుడిపై బీర్‌బాటిల్ తో వ్యక్తుల దాడి

ఉప్పల్, జూన్ 1 : మద్యం సీసాతో యువకుడిని పొడిచిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నాగోల్‌కు చెందిన ఆదిత్య(24) ప్రైవేట్ ఉద్యోగి. స్నేహితులతో కలిసి ఉప్పల్ రింగ్ రోడ్డు సమీపంలో శనివారం ఉదయం 4.30 గంటల సమయంలో మాస్టర్‌చెఫ్ హోటల్ ప్రాంతంలో టిఫిన్ చేయడానికి వెళ్లాడు. కొందరు వ్యక్తులు ఆదిత్య, అతడి స్నేహితుల వద్దకు వచ్చి దుర్భాషలాడారు. యువకులకు మధ్య ఘర్షణ జరిగింది. దీనితో యువకులు బీర్‌బాటిల్‌తో ఆదిత్యను కడుపులో పొడిచారు. దీనితో ఆదిత్య తీవ్రంగా గాయపడగా, ఆదిత్య స్నేహితులకు గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నాచారంలోని ప్రసాద్ హాస్పిటల్‌కు తరలించారు. తన కుమారుడిని చంపడానికి ప్రయత్నించారని ఆరోపిస్తూ ఆదిత్య తల్లి సంగీత ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు మేడిపల్లికి చెందిన సాయికిరణ్(24) అలియాస్ మిల్లు సాయి, గాంధీనగర్‌కు చెందిన కొమ్ము ప్రశాంత్(25) అలియాస్ చిన్నా, హనుమసాయినగర్‌కు చెందిన లంక నవీన్(23), ఉప్పల్ ఇందిరానగర్‌కు చెందిన హనుమకొండ భరత్(21) అలియాస్ బబ్లు, లక్ష్మారెడ్డికాలనీకి చెందిన టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు దిగంబర్(32)గా గుర్తించి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పీర్జాదిగూడ, జూన్1: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు పోలీసుల కథనం ప్రకారం....పీర్జాదిగూడ మల్లికార్జున్ నగర్‌లోకాలనీలో బెంగళూరుకు చెందిన సత్యనారాయణ పటేల్ అనే వ్యక్తి ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటూ అప్పుడపుడు వచ్చి వెళ్లి పోతూ ఉండేవాడు.అయితే శనివారం ఉదయం ఆ గది నుంచి దుర్వాసన రావడం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గది తలపులు తెరిచి చూడగా కుళ్లిపోయిన మహిళ మృతదేహం ఉంది. వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు మహిళ ఎవరు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు డ్రైవర్ ఆత్మహత్య

మల్కాజిగిరి, జూన్ 1: కుటుంబ తగాదాలతో కారు డ్రైవర్ ఆత్యహత్య చేసుకున్న ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథ నం ప్రకారం... నల్గొండ జిల్లా చిట్యాలకు చెందిన పల్లెబోయిన ఐలయ్య(40) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని సంవత్సరాల క్రితం నగరానికివచ్చి ఎస్సీనగర్‌లో ఉంటున్నాడు. భార్యా భర్తల మధ్య తగాదాల వల్ల భార్య జయతో పాటు కుమారుడు పవన్(9), కొన్ని నెలలుగా చిట్యాలలో ఉం టున్నారు. శనివారం ఐలయ్య ఉంటున్న ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి పరిశీలించగా ఐలయ్య ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్యహత్య చేసుకున్నట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమో దు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురికి తరలించారు.

విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్త వహించాలి

మేడ్చల్ రూరల్, జూన్ 1: విత్తనాల కొనుగోలు సయమంలో రైతులు జాగ్రత్తలు వహించాలని మేడ్చల్ ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి కోరారు. విత్తన కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి, శ్రీరంగవరం గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు సమయంలో దుకాణం నుంచి రసీదు తీసుకోవాలని సూచించారు. విత్తన ప్యాకెట్ కవర్, బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అర్చన, విస్తర్ణ అధికారి తేజశ్వని, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గౌడవెల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి

నేడు 'జాతీయ పతాకావిష్కరణ'

మేడ్చల్,జూన్1: తెలంగాణ రాష్ట్ర ఆవి ర్భావ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ పుర పాలక సంఘం కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహ రెడ్డి అధ్యక్షతన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్టు కమిషనర్ నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ కేఎల్ఆర్ స్వాగత తోరణం, జయశంకర్ చౌరస్తాలో ఉదయం 7 గంటలకు జెండాను ఆవిష్కరించనున్నట్టు జయశంకర్ విగ్రహ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, నాయకులు, ఉద్యమకారులు తరలిరావాలని వారు కోరారు.

కీసరలో..

కీసర: తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో గ్యామా కోరారు. ఆదివారం ఉదయం 9 గంటలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ ఇందిరలక్ష్మీనారాయణ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలంగాణ అభిమానులు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

చోరీలు చేస్తూ తప్పించుకుకు తిరుగుతున్న దొంగలు అరెస్టు

ఘట్‌కేసర్,జూన్1: దొంగలను ఘట్‌కేసర్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఘట్‌కేసర్ సీఐ సైదులు కథనం ప్రకారం.. మే7న ఘట్‌కేసర్‌లోని మాధవ రెడ్డి వంతెన సమీపంలోని కౌసల్య వెంచర్ కాలనీలోని ఉన్న పోచిరెడ్డి ఇంట్లో బొందల మల్లేష్,భూపని ఆకాష్,షేక్ అల్తాఫ్,వెంకట ప్రసాద్ దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్నారని సీఐ తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టగా శనివారం ఉదయం యంనంపేట్ చౌరస్తాలో ఆటోలో వెళుతుండగా అక్కడున్న పోలీసులు అనుమానం వచ్చి ఆటో ఆపి విచారించగా ఈనెల 7న దొంగతనం చేసిన విషయం ఒప్పుకున్నారు.ఈ నలుగురి వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్‌లో 41గ్రాములు బంగారం,40 తులాల వెండి పూజా వస్తువులు లభించినట్లు పేర్కొన్నారు.వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

కీసర, జూన్ 1: కీసరదాయరలో నెలలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కారించాలంటూ ఆ గ్రామస్తులు శనివారం విద్యుత్‌శాఖ కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. కీసర మండలంలోని భోగారం విద్యుత్ ఫీడర్ నుంచి 11కేవీ విద్యుత్ సరఫరా రాంపల్లిదాయర, చింతబాయి, నూకలగూడెం,కీసరవరకు వ్యవసాయ పొలాల నుంచి సుమారు 2 కిలోమీటర్ల వరకు కీసరదాయర వరకు ఉండటం వల్ల దీంతో ప్రకృతి వైపరీత్యాలతో గాలి దుమారాలకు ఒక్కసారిగా స్తంభాలు విరిగిపోతున్నాయని, దీంతో రెండు మూడు రోజుల పాటు విద్యుత్ సమస్య నెలకొంటుందని విద్యుత్ ఏఈ మురళీకృష్ణతో మొరపెట్టుకున్నారు. ఈ సమస్య 20 సంవత్సరాల నుంచి నెలకొంటుందని, దీంతో గ్రామంలో చాలామందికి ప్రధానంగా విద్యార్థులకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని వారు వాపోయారు. వెంటనే ఈ విషయంపై విద్యుత్ అధికారులు స్పందించి మా గ్రామానికి ప్రత్యేకంగా మెయిన్‌రోడ్డు నుంచి లైన్ వేసి 24గంటల పాటు కరెంట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులకు ఇచ్చిన వినితిపత్రంలో పేర్కొన్నారు.

విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రాన్ని అందిస్తున్న కీసరదాయర గ్రామస్తులు

మున్సిపాలిటీ స్థలాన్ని కబ్జా కానివ్వం

ఘట్‌కేసర్,జూన్1: మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాన్ని కబ్జా కానివ్వకుండా కాపాడుతామని పోచారం చైర్మన్ బి.కొండల్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ యంనంపేట్ శ్రీ వేంకటేశ్వర కాలనీలోని పార్కు స్థలాన్ని ఆయన శనివారం కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది కబ్జాదారులు మున్సిపాలిటీకి చెందిన 8వేల చదరపు గజాల ఈ స్థలాన్ని నకిలీ పత్రాలతో కబ్జా చేయాలని చూస్తున్నారని ,కబ్జాదారులకు ఇది సాధ్యం కాదని చైర్మన్ స్పష్టం చేశారు. ఈ పార్కు స్థలానికి మున్సిపాలిటీ నిధులు రూ.20లక్షలతో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను కూడా కబ్జాదారులు తొలగించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికే పోచారం పోలీస్టేషన్‌లో ఈ పార్కు స్థలం కబ్జాపై ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.మున్సిపాలిటీ స్థలాన్ని కబ్జా చేస్తే ఎంతటి వారైనా వదిలేది లేదని చైర్మన్ తెలిపారు.కార్యక్రమంలో కౌన్సిలర్ రాజశేఖర్,బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి శేఖర్‌లు చైర్మన్ వెంట ఉన్నారు.

కబ్జాదారులు